

ప్రజలకు అందని కేంద్ర పథకాలు

కేంద్ర పథకాలు ప్రజలకు చేరకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. 8లో▸



డీసీఎంను ఢీకొట్టిన బస్సు

డ్రైవర్ నిర్లక్ష్యం వలన బస్సు ప్రమాదం జరిగింది. ఈ ఘటన మండల కేంద్రంలోని బైపాస్ రహదారి మేకగూడ చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. 8లో▸



హుండీ ఆదాయం లెక్కింపు

మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయ ఆవరణలో బుధవారం అధికారులు, పాలకవర్గం సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 8లో▸

న్యూస్‌రీల్

పారదర్శకంగా ఉపాధి సామాజిక తనిఖీ

కలెక్టర్ హరీష్

ఇబ్రహీంపట్నం రూరల్: పారదర్శకంగా ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ నిర్వహించాలని కలెక్టర్ హరీష్ అధికారులకు సూచించారు. ఉపాధి సామాజిక తనిఖీపై రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 1025 సోషల్ ఆడిట్లకు గాను 254 పూర్తి చేయడం జరిగిందని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. శ్రీనిధి, సెర్ప్, గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా మంజూరు చేసిన లింకేజీ రుణాలను ఎంపీఏ లేకుండా వసూలు చేసి లక్ష్యాలు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటామని కలెక్టర్.. ప్రత్యేక కార్యదర్శికి వివరించారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



రాయపోల్ పాదయాత్రలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర బుధవారం పోల్కంపల్లి, రాయపోల్, ముకునూర్ గ్రామాల్లో సాగింది. ఆయా గ్రామాల్లో పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కనీస వేతనం నెలకు రూ. 26వేలు నిర్ణయించాలని కోరారు. జీవో నెంబరు 51ని సవరించి, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు, నాయకులు వెంకటయ్య, గణపతిరెడ్డి, మహేష్, వినోద్‌కుమార్, సోమయ్య, సామేలు, జగదీష్, జగన్, నర్సింహ, జంగయ్య, జగన్, కిషన్, రవికుమార్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మరో మూడు నామినేషన్లు

సాక్షి, సిటీబ్యూరో: మహబూబ్‌నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి బుధవారం ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. లింగిడి వెంకటేశ్వర్లు, ఎస్.విజయ్‌కుమార్, కాంటే సాయన్నలు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలాకు అందజేశారు. హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.

ప్రచారంలో బిజీ..

హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జేఏసీయూ మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వినయ్ బాబును మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, ఉపాధ్యక్షులు సురేందర్, సికింద్రాబాద్ మండల బాధ్యులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్కడ పట్టి.. ఇక్కడ వదిలి..

నగరంలో కుక్కల్ని పట్టి శివారు ప్రాంతాల్లో వదులుతున్న సిబ్బంది

- అంబర్‌పేట ఘటనతో ఉలిక్కిపడ్డ శివారు జనం
- తాజాగా రాజేంద్రనగర్‌లో స్వైరవిహారం
- ఆడుకుంటున్న చిన్నారులు, జీవాలపై దాడి
- కుక్కకాటు కేసుల్లో జిల్లా రెండో స్థానం

కుక్కకాటు కేసులు ఇలా..

సంవత్సరం	జీహెచ్‌ఎంసీ	రంగారెడ్డి జిల్లా
2019	38,958	9,324
2020	27,926	9,146
2021	27,925	1,540
2022	28,859	6,348
2023	2,784	960



సాక్షి, రంగారెడ్డి జిల్లా: వీధి సింహాలు విజృంభిస్తున్నాయి. నమ్మకమైన నేస్తాలే.. నడివీధిలో వెంటాడుతున్నాయి. ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారులపై.. వీధిలో నడుచుకుంటూ వెళ్తున్న బాటసారులపై గుంపులు గుంపులుగా మీదపడి ఈడ్చుకెళ్తున్నాయి. అడ్డుకోబోయిన వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎప్పటికప్పుడు కుక్కలను నియంత్రించాల్సిన స్థానిక సంస్థలు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సిటీలో బంధించిన కుక్కలను ఆ తర్వాత గుట్టుగా శివారు మున్సిపాలిటీల్లో వదులుతున్నారు. దీంతో వాటికి తినేందుకు ఆహారం, తాగేందుకు నీరు కూడా దొరకడం లేదు. వీటికి తోడు భగ్గుమంటున్న ఎండలతో చిర్రెత్తి పిచ్చిగా ప్రవర్తిస్తున్నాయి. రోడ్డుపై వచ్చిపోయే వాహనదారులతో పాటు గొర్రెలు, మేకలు, జింకల మందలపై విరుచుకుపడుతున్నాయి. రెండు రోజుల క్రితం అంబర్‌పేటలో నాలుగేళ్ల బాలుడి మృత్యువాతకు కారణమైన కుక్కలు, తాజాగా రాజేంద్రనగర్ డివిజన్ హైదర్‌గూడ ఎర్రబోడకాలనీలో ఓ వీధి కుక్క బీభత్సం సృష్టించింది. వరుసగా ఐదుగురిపై దాడికి పాల్పడడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

కుక్కకాటు కేసుల్లో రెండో స్థానంలో జిల్లా

గ్రేటర్ జిల్లాల్లో 5.75 లక్షల కుక్కలు ఉన్నట్లు అంచనా. వీటి నియంత్రణకు ఏటా రూ. 10కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు అంచనా. అయినా వాటి సంఖ్య తగ్గకపోగా ఏటా మరింత పెరుగుతున్నాయి. ఫలితంగా నగరంలో రోజుకు సగటున 60–70 కుక్కకాటు కేసులు నమోదవుతుంటే.. వీటిలో సగానికిపైగా కుక్కకాటు కేసులు ఓఆర్‌ఆర్‌కు అటుఇటుగా విస్తరించి ఉన్న మణికొండ, నార్సింగి, బండ్లగూడ, బడంగ్‌పేట్, మీర్‌పేట్, జల్‌పల్లి, ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్ పేట్, తుర్కయాంజాల్, శంషాబాద్, శంకర్‌పల్లి, తదితర శివారు మున్సిపాలిటీల్లోనే నమోదవుతుండడం విశేషం. తెలంగాణ వ్యాప్తంగా అత్యధిక కుక్కకాటు కేసులు నమోదవుతున్న జిల్లాల జాబితాలో హైదరాబాద్ మొదటి స్థానంలో ఉంటే, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు వరుస స్థానాల్లో నిలవడం గమనార్హం. జీహెచ్‌ఎంసీ పరిధిలో గత ఏడాది 28,859 కుక్కకాటు కేసులు నమోదైతే.. వీటిలో ఒక్క రంగారెడ్డి రూరల్ ఏరియాలోనే 6,348 కేసులు ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు జీహెచ్‌ఎంసీ పరిధిలో 2,784 కుక్కకాటు కేసులు నమోదు కాగా.. జిల్లాలో 960 కేసులు నమోదు కావడం విశేషం. కుక్కల నియంత్రణ, స్టెరిలైజేషన్ పేరుతో సిటీలో బంధించిన కుక్కలను ఆ తార్వాత శివారు ప్రాంతాల్లో వదులుతుండడమే ఇక్కడ కుక్కకాటు కేసులు పెరగడానికి ప్రధాన కారణమని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. శివారులోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇంజక్షన్లు లేకపోవడం ఉన్న చోట కూడా మధ్యాహ్నం రెండు గంటలకే వైద్యులు ఇంటి ముఖం పడుతుండటంతో అత్యవసర పరిస్థితుల్లో బాధితులు నారాయణగూడ ఐపీఎం, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రులకు పరుగులు తీయాల్సి వస్తోంది.

వీధి కుక్కలకు దూరంగా ఉండాలి

కుక్కలకు వేటాడే లక్షణం ఉంటుంది. ఈ లక్షణమే పరుగెత్తే వారిపై దాడికి కారణమవుతుంది. కుక్క అరుస్తున్నప్పుడు భయంతో పరుగెత్తరాదు. నెమ్మదిగా నడుచుకుంటూ ముందుకు వెళ్లాలి. చాలా మంది పిల్లలు భయంతో వేగంగా పరుగెత్తుతుంటారు. కుక్కలో ఉన్న వేటాడే లక్షణం వారిపై దాడికి కారణమవుతోంది. కుక్కకాటుతో రేబిస్ వ్యాధి సోకుతుంది. కుక్క కరిచిన వెంటనే టీటీ ఇంజక్షన్ తీసుకోవాలి. 48 గంటల్లోగా యాంటీ డాగ్ బైట్ ఇంజక్ష తీసుకోవాలి. గాయానికి ఎలాంటి కట్టు కట్టరాదు. ధారగా ప్రవహించే నీటి కుళాయి కింద గాయాన్ని ఉంచి శుభ్రం చేసుకోవాలి. సాధ్యమైనంత వరకు కుక్కలకు దూరంగా ఉండాలి. జిల్లాలోని అన్ని సీహెచ్‌సీల్లో సుమారు రెండు వేల యాంటీ డాగ్ బైట్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ

ఎర్రబోడలో వెర్రెక్కిన కుక్కలు



కుక్కల దాడిలో గాయపడ్డ పునీత్, పవన్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎర్రబోడ ప్రాంతంలో ఇంటి ముందు ఆడుకుంటున్న అయిదుగురు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేశాయి. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఎర్రబోడకు చెందిన పునీత్(8), పవన్, చేతన్, వెంకటేష్‌తో పాటు మరో బాలుడు మంగళవారం ఇంటిముందు ఆడుకుంటున్నారు. మొదట వీధి కుక్క పునీత్‌పై దాడి చేసింది. గమనించిన పవన్ దాన్ని రాయితో కొట్టేందుకు ప్రయత్నించగా అతడిని సైతం కరిచింది. స్థానికులు కుక్కలను తరిమివేయడంతో ముందుకు వెళ్లిన కుక్కలు ఇదే బస్తీకి చెందిన చేతన్, వెంకటేష్‌తో పాటు మరో చిన్నారిని కరిచాయి. పునీత్, పవన్‌లకు కాళ్లు, చేతులు, తలకు గాయాలయ్యాయి. వీరిని వారి తల్లిదండ్రులు హైదర్‌గూడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. 15రోజుల క్రితం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో వీధి కుక్కల విషయమై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఎర్రబోడ ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

స్పెషల్ డ్రైవ్ చేపడతాం

వీధి కుక్కల స్వైర విహారంపై దక్షిణ మండలం జీహెచ్‌ఎంసీ వెటర్నరీ అధికారి శ్రీకాంత్‌ను వివరణ కోరగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి కుక్కలను పట్టుకుంటామన్నారు. సంతాన నిరోధక శస్త్ర చికిత్స చేసి అనంతరం వాటిని అదే ప్రాంతంలో వదులుతామన్నారు. పిచ్చి కుక్కలు ఉంటే వాటిని అక్కడ నుంచి తరలిస్తామన్నారు.

ఉద్యోగ, ఉపాధే లక్ష్యంగా..

షాబాద్‌ను పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దుతాం

- 40 నుంచి 50 పరిశ్రమల ఏర్పాటుకు కృషి
- ఐటీ, మున్సిపల్, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్
- ఐదేళ్లలో ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోతాయి
- శంషాబాద్ – నాగర్‌గూడ రోడ్డు పనులకు రూ. 200 కోట్లు



హైతాబాద్ చౌరస్తాలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో సబితారెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, ఎంపీ రంజిత్‌రెడ్డి

షాబాద్: ఐదేళ్లలో చేవెళ్ల, షాబాద్ ప్రాంతాల రూపురేఖలే మారిపోతాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. ఈ ప్రాంతంలో దండిగా పరిశ్రమలు వస్తున్నాయని, దీంతో యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. బుధవారం షాబాద్ మండలం హైతాబాద్ చౌరస్తాలో మంత్రి సబితారెడ్డితో కలసి బీఆర్‌ఎస్ జెండాను ఆయన ఆవిష్కరించారు. తమ ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. చందనవెల్లి, సీతారాంపూర్‌లాంటి ప్రాంతాల్లో పరిశ్రమలు వచ్చాయని, వచ్చే ఐదేళ్లలో మరో 50 పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో ప్రగతి పరుగులు పెడుతోందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పారిశ్రామిక హబ్‌ను ఏర్పాటు చేశారని, దీంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి, అర్హులైన వారికి ఉద్యోగాలు ఇప్పించే ఏర్పాట్లు చేస్తామన్నారు. నైపుణ్యం లేని వారికి శిక్షణ ఇచ్చి, వారికి కూడా ఉద్యోగాలు వచ్చేలా చూస్తామన్నారు. ఈ ప్రాంతంలో ఐటీ కంపెనీలను మరింత విస్తారిస్తామన్నారు. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి జిల్లాలో ఐటీ విస్తరించాలన్న తమ ప్రభుత్వ లక్ష్యాన్ని వెల్‌స్పన్ నిర్ణయం బలోపేతం చేస్తుందన్నారు. గచ్చిబౌలి, కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లాంటి ప్రాంతాల మాదిరిగా ఐటీ కంపెనీలు ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక ప్రజల ఆకాంక్ష కూడా వెల్‌స్పన్ కేంద్రం ఏర్పాటుతో నెరవేరబోతుందన్నారు. చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు అనువైన ప్రాంతామని, మరిన్ని పరిశ్రమలు రాబోతున్నాయని మంత్రి తెలిపారు. హైతాబాద్, చందనవెల్లి, మాచనపల్లి గ్రామాల్లో భూములు కోల్పోయిన రైతులకు హెచ్‌ఎండీఏ ప్లాట్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. చేవెళ్ల నియోజకవర్గానికి హెచ్‌ఎండీఏ ద్వారా 25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. శంషాబాద్ నుంచి నాగర్‌గూడ వరకు రోడ్డు మరమ్మతులకు రూ. 200 కోట్లు మంజూరు చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడా జరగని అభివృద్ధి చేవెళ్ల నియోజకవర్గంలో జరుగుతోందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును త్వరలో పూర్తి చేస్తామని, దీంతో ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రిసబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఐటీ సెక్రటరీ జయేష్‌రంజన్, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ నాగేందర్‌గౌడ్, కార్తీక్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు ఎక్కువైందని భార్యను వదిలేశాడు..

సాక్షి, సిటీబ్యూరో: 'ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు' అంటారు. కానీ, ఓ ప్రవాస ప్రబుద్ధుడు భార్య చదువు ఆర్థిక భారంగా భావించాడు. ఉన్నత చదువులు చదివి..మంచి ఉద్యోగం సంపాదించి భర్తకు చేదోడుగా నిలుద్దామనుకున్న ఆమె కలలను కల్లలు చేశాడు. విదేశాల్లో ఒంటరిగా వదిలేసి..తాపీగా చేతులు దులుపేసుకున్నాడు. అల్లుడికి నచ్చచెబుదామని పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోవటంతో.. దిక్కుతోచని స్థితిలో బాధితురాలి తల్లిదండ్రులు గచ్చిబౌలిలోని మహిళా పోలీసులను ఆశ్రయించారు. పూర్తి వివరాలు ఇలా..

- మాదాపూర్ జోన్‌కు చెందిన కావ్య (పేరు మార్చాం) స్థానికంగా డిగ్రీ పూర్తి చేసింది. దాదాపు ఐదేళ్ల క్రితం తల్లిదండ్రులు మ్యాట్రిమోని సైట్ల ద్వారా పెళ్లి సంబంధం వెతికి అమెరికాలో స్థిరపడిన కిషోర్ (పేరు మార్చాం)కు ఇచ్చి పెళ్లి చేశారు.
- కిషోర్ యూఎస్‌లోని వర్జీనియాలో ఉద్యోగి కావటంతో.. పెళ్లి తర్వాత ఈ యువ జంట అక్కడికి వెళ్లింది. కొన్నాళ్లు అన్యోన్యంగానే ఉన్నారు. మధ్యలో ఆపేసిన చదువును పూర్తి చేద్దామని భావించిన కావ్య అక్కడే ఓ యూనివర్సిటీలో ఎంఎస్‌లో చేరింది. దీంతో భర్త అసలు రంగు బయటపడింది.
- భార్య చదువు ఆర్థిక భారంగా మారిందని కిషోర్ తనని దూరం పెట్టడం మొదలుపెట్టాడు. దీనిపై ఇద్దరి మధ్య తగాదాలు మొదలయ్యాయి. ఈ విషయాన్ని ఇండియాలో ఉన్న తల్లిదండ్రులకు వివరించింది కావ్య. దీంతో పలుమార్లు ఫోన్‌లో అల్లుడితో మాట్లాడేందుకు ప్రయత్నించగా పట్టించుకోలేదు. అల్లుడి తల్లిదండ్రులను కలిసి వారి కొడుక్కి సర్దిచెప్పమని చెబుదామని ప్రయత్నిస్తే వారి నుంచి కూడా స్పందన లేదు. దీంతో చేసేదిలేక గచ్చిబౌలిలోని మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- కేసు నమోదు చేసిన పోలీసులు కిషోర్ తల్లిదండ్రులను విచారించగా.. వాళ్లిద్దరి మధ్య అవగాహన సరిగా లేదని చెప్పి చేతులు దులిపేసుకున్నారు. దీంతో విదేశంలో కూతురు ఒంటరైపోయిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఎన్నారై సంబంధం ఇలా పెటాకులు కావటంతో అమ్మాయి చదువు, వసతి ఇతరత్రా ఖర్చులన్నీ తల్లిదండ్రులే భరిస్తున్నారు.

ఎన్నారై బంధానికి ఏడు సూత్రాలు:

- ఎన్నారైల ఎంపిక, పెళ్లి చేసే విషయంలో తొందరపడకూడదు.
- వరుడు/వధువు అతని కుటుంబ సభ్యుల నేపథ్యాన్ని ధ్రువీకరించుకోవాలి.
- మ్యారేజ్ బ్రోకర్లు, బ్యూరోలపై ఆధారపడి సంబంధాన్ని అంగీకరించకూడదు.
- ప్రవాసుల వివాహాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలి.
- విదేశాలలో చట్టపరమైన హక్కులు, అర్హతలు, అత్యవసర సేవల గురించి తెలుసుకోవాలి.
- వధువు వీసా, పాస్‌పోర్ట్, ఇతరత్రా ముఖ్యమైన కాపీలను వధువు కుటుంబం లేదా దగ్గరి స్నేహితుల వద్ద ఉంచాలి.
- ఎన్నారై వరుడి పాస్‌పోర్ట్, విదేశీయుల నమోదు కార్డు, సామాజిక భద్రత నంబరు, గత మూడు సంవత్సరాలకు సంబంధించిన పన్ను రిటర్న్‌లు, బ్యాంకు పత్రాలు వంటి కీలకమైన పత్రాలను తనిఖీ చేయాలి.

శివపార్వతుల విహారం



శివపార్వతుల పల్లకీ సేవలో భక్తులు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం శివపార్వతులు మాడ వీధుల్లో విహరించారు. తెల్లవారుజామున దోపోత్సవం నిర్వహించారు. ఉదయం శివపార్వతులకు అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ వంటి సేవలు నిర్వహించారు. ఉత్సవాల చివరి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు. బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిశాయని ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, ఆలయ ఈఓ మురళీకృష్ణ తెలిపారు. ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దాతలను ఘనంగా సన్మానించారు. ఏసీపీ అంజయ్య, సీఐ మధుసూదన్, ఎస్ఐ వెంకటయ్య నాయక్‌కు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు చంద్రయ్య, యాదమ్మ, బాల్‌రాజ్, మహేందర్, రవీందర్, వెంకటేష్, సర్పంచ్ ప్రియాంక, ఎంపీటీసీలు సుదర్శన్ యాదవ్, అనురాధ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అంబయ్య యాదవ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు యాదయ్య, ఈశ్వర్, కుమార్, నవీన్, నాగేశ్వర్, పీఏసీఎస్ డైరెక్టర్లు ప్రభాకర్, బాలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఏకలవ్య, అశోక్, పరమేష్, కుమార్, కృష్ణ, వీరబాబు పాల్గొన్నారు.

ఢిల్లీ టు సిటీ.. వయా కోల్‌కతా

- ఎన్‌ఓసీ తప్ప అన్నీ తయారు చేస్తున్న ముఠా
- ఐదుగురిని పట్టుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్
- రూ. 2.45 కోట్ల విలువైన 18 కార్లు స్వాధీనం, పరారీలో సూత్రధారి

చోరీ చేసిన కార్ల 'వివరాలు' మార్చి విక్రయం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సునీల్‌దత్

సాక్షి, సిటీబ్యూరో: దేశ రాజధాని ఢిల్లీలో కార్లను దొంగిస్తారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో వాటి 'వివరాలు' మారుస్తారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు తరలించి తక్కువ ధరకు విక్రయిస్తారు. ఓ అంతర్రాష్ట్ర ముఠా కొన్నాళ్లుగా సాగిస్తున్న గుట్టును ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. అయిదుగురిని అరెస్టు చేసి రూ.2.45 కోట్ల విలువైన 18 హైఎండ్ కార్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న సూత్రధారి సహా మరికొందరి కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు డీసీపీ సునీల్ దత్ పేర్కొన్నారు. డీసీపీ డాక్టర్ పి.శబరీష్‌తో కలిసి బుధవారం సికింద్రాబాద్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు.

బప్పా ఘోష్ నేతృత్వంలో..

కోల్‌కతాకు చెందిన బప్పా ఘోష్ దేశ వ్యాప్తంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నాడు. తేలికపాటి వాహనాలు చోరీ చేయడానికి, వాటి ఇంజిన్, చాసిస్ నంబర్లు మార్చి నకిలీ నంబర్ ప్లేట్లు తగిలించడానికి, ఇలా తయారైన సెకండ్ హ్యాండ్ కార్లను విక్రయించడానికి వేర్వేరుగా ముఠాలు నిర్వహిస్తున్నాడు. ప్రధాన ముఠా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌ల్లో హైఎండ్ కార్లను తస్కరిస్తుంది. వీటిని కోల్‌కతాకు తీసుకువెళ్లి బప్పా ఘోష్‌కు అప్పగిస్తుంది. అక్కడే మరో గ్యాంగ్ టైగర్ మార్కింగ్ విధానంలో వీటి ఇంజిన్, చాసిస్ నంబర్లు మార్చేస్తుంది. అప్పటికే ఉన్న నంబర్‌ను పూర్తిగా తుడిచేసి, అసలు దాన్ని తలదన్నేలా నకిలీ నంబర్ ముద్రించడాన్నే టైగర్ మార్కింగ్ అంటారు.

అక్కడ తిరిగే కార్ల వివరాలతోనే...

ఈ ముఠా వాహనానికి తగిలించే రిజిస్ట్రేషన్ నంబర్ విషయంలో ఘోష్ పక్కాగా వ్యవహరిస్తున్నాడు. తస్కరించిన కారు మోడల్, రంగుతో ముంబై, కోల్‌కతాల్లో సంచరిస్తున్న వాహనాలవే వీటికీ తగిలిస్తున్నాడు. ఈ వివరాలతోనే ఆర్సీలు తయారు చేస్తున్నాడు. ఒక రాష్ట్రానికి సంబంధించిన వాహనాలు మరో రాష్ట్రంలో రీ రిజిస్ట్రేషన్ కావాలంటే దానికి ఇతర పత్రాలతో పాటు నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) తప్పనిసరి. ప్రతి ఆర్టీఏ విభాగం తాము జారీ చేసిన ఎన్‌ఓసీల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తుంది. వీటిని మరో రాష్ట్రం ఆర్టీఏ అధికారులు చూడగలుగుతారు. ఇలా నకిలీ ఎన్‌ఓసీలను తేలిగ్గా గుర్తించవచ్చు. ఈ కారణంగానే ఘోష్ గ్యాంగ్ ఎన్‌ఓసీలను మాత్రం తయారు చేయట్లేదు.

విక్రయించిన ధర కంటే తక్కువకు...

ఘోష్‌కు దేశ వ్యాప్తంగా వివిధ నగరాలు, పట్టణాల్లోని కారు డీలర్లతో పరిచయాలు ఉన్నాయి. వీరికి స్థానికంగా ఉన్న డీలర్లతో సంబంధాలు ఉంటున్నాయి. అలాంటి వారిలో నగరానికి చెందిన శైలేందర్ సింగ్, అబ్దుల్ రహీం ఖాన్, షేక్ జావేద్, వరికుప్పల దశరథ్, షానవాజ్ అలీ ఖాన్, కందిమళ్ల పరిపూర్ణాచారి, ఖలీమ్ కీలక వ్యక్తులు. వీరి ద్వారా ఘోష్ నగరంలో 18 కార్లు విక్రయించాడు. అమాయకులను ఎంపిక చేసుకుని వాహనం వాస్తవ ధరకు సగానికే అమ్మడానికి ఒప్పందం కుదుర్చుకుంటారు. అడ్వాన్స్ తీసుకుని, వాహనం అప్పగించాక మిలిగిన మొత్తంలో రూ.లక్ష తక్కువ తీసుకుంటారు. ఎన్‌ఓసీ ఇచ్చాక ఆ డబ్బు ఇవ్వాలంటారు. వీళ్లు ఈ పత్రం ఇవ్వడం, వాళ్లు ఆ మొత్తం ఇవ్వడం జరగనే జరగదు.

చిలకలగూడ వ్యక్తి ఫిర్యాదుతో కేసు..

తూర్పు మండల పరిధిలోని చిలకలగూడ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి రహీం ఖాన్ నుంచి కారు ఖరీదు చేశాడు. ఎన్నాళ్లకూ ఎన్‌ఓసీ ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి ఆరా తీయగా.. చోరీ వాహనంగా తేలింది. దీంతో ఆయన ఈ నెల 17న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనాథ్‌రెడ్డి నేతృత్వంలో ఎస్సైలు బి.అశోక్‌రెడ్డి, కె.శ్రీకాంత్, ఎం.అనంతాచారి, బి.అర్వింద్ గౌడ్‌లతో కూడిన బృందం ఘోష్, పరిపూర్ణాచారి, ఖలీమ్ మినహా మిగిలిన వారిని అరెస్టు చేసింది. వీరిలో పరిపూర్ణాచారి గతేడాది ఫిబ్రవరిలో మరో ఇద్దరితో కలిసి మిర్యాలగూడ పోలీసులకు చిక్కాడు. ఆ కేసులోనూ ఘోష్ వాంటెడ్‌గానే ఉన్నాడు. ఇతగాడు చిక్కితే కీలక విషయాలు బయటపడే అవకాశం ఉండటంతో పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. స్వాధీనమైన 18 కార్లలో అన్నీ హైఎండ్ మోడల్సే కావడం గమనార్హం.

డీసీఎంను ఢీకొట్టిన బస్సు

- డ్రైవర్, కండక్టర్, 9మంది ప్రయాణికులకు గాయాలు
- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన పోలీసులు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు

నందిగామ: డ్రైవర్ నిర్లక్ష్యం వలన బస్సు ప్రమాదం జరిగింది. ఈ ఘటన మండల కేంద్రంలోని బైపాస్ రహదారి మేకగూడ చౌరస్తా వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి వనపర్తికి వెళ్తోంది. ఈ క్రమంలో నందిగామ శివారులోని మేకగూడ చౌరస్తా వద్దకు రాగానే బ్రేక్‌ఫాస్ట్ లోడ్‌తో ముందు వెళ్తున్న డీసీఎంను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ రఘు వర్ధన్‌రెడ్డి, కండక్టర్ నారాయణ, ప్రయాణికులు శ్రీనివాస్‌రెడ్డి, నారమ్మ, దావూద్, నూర్జహాన్, మహ్మద్‌గౌస్, ఎల్లమ్మ, కృష్ణ, డీసీఎంలో ఉన్న కార్మికులు సోను చౌదరి, ప్రదీప్ చౌదరి గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలికి చేరకుని క్షతగాత్రులను షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. డీసీఎం యజమాని జింకల చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రామయ్య తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ..

అబ్దుల్లాపూర్‌మెట్: బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు చెప్పిన ప్రకారం.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గోర్లపాటు తండాకు చెందిన తేజావత్ సాయికుమార్ (23) దిల్‌సుఖ్‌నగర్‌లో నివాసముంటున్నాడు. తన బైక్‌పై చౌటుప్పల్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్నాడు. అబ్దుల్లాపూర్‌మెట్ కూడలి వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో సాయికుమార్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉపాధి కల్పన భేష్


రవికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

మాడ్గుల: స్వయం ఉపాధి పొందుతూ మరికొంత మందికి ఉపాధి కల్పించడం అభినందనీయమని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇర్విన్ గ్రామంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, రైతు సమితి మండల అధ్యక్షుడు నూతనంగా నిర్మించిన శ్రీ శుభం గార్డెన్ బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవిని పలువురు అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీ సింగ్, కొల్కులపల్లి ఎంపీటీసీ సభ్యుడు కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, నాయకులు కొండల్‌రెడ్డి, విష్ణు, జంగయ్యయాదవ్, వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డుపై నడుస్తున్న గుర్తు తెలియని వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రామకృష్ణ ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున మంచాల మండల కేంద్రానికి చెందిన చందు తన ద్విచక్ర వాహనంపై ఇబ్రహీంపట్నం నుంచి మంచాలకు వెళ్తున్నాడు. ఆర్‌కేడీయా సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి(55) అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న చందు తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ టీపీ వైవీ ఉపాధ్యక్షుడిగా ముస్తఫా



ఇబ్రహీంపట్నం రూరల్: వైఎస్సార్ టీపీ యువజన విభాగం(వైఎస్సార్ టీపీ వైవీ) జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నంకు చెందిన మహ్మద్ ముస్తఫా నియమితులయ్యారు. బుధవారం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎడమ మోహన్‌రెడ్డి, గడ్డం హిందుజారెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముస్తఫా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

పెయింటర్ అదృశ్యం


రహీష్ అహ్మద్(ఫైల్)

మహేశ్వరం: పెయింటర్ అదృశ్యమైన సంఘటన మహేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అజయ్ తెలిపిన ప్రకారం.. యూపీకి చెందిన రహీష్ అహ్మద్(29), రుబీనా ఐదు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కాగా వీరు రెండు నెలల క్రితం ఉపాధి కోసం ఇమాంగూడకు తరలివచ్చారు. పెయింటర్‌పని చేసే అహ్మద్‌రోజు మాదిరిగానే ఈ నెల 21న తుమ్మలూరు గేట్ వద్దకు వెళ్లాడు. రాత్రైనా తిరిగి రాకపోవడంతో ఆందోళనతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ చేసి ఉంది. దీంతో అతడి భార్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని, 94906 17241 నెంబర్‌లో గాని సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

ప్రజలకు అందని పథకాలు

మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్


ఇబ్రహీంపట్నం రూరల్: మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్


యాచారం: కార్నర్ సమావేశంలో మాట్లాడుతున్న దేవయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి ఇబ్రహీంపట్నం మండలంలోని దండుమైలారంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీశైలం ఆధ్వర్యంలో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూర నర్సయ్యగౌడ్, నటి జీవిత రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూర మాట్లాడుతూ తెలంగాణను అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది కేంద్ర ప్రభుత్వమేనని చెప్పారు. గ్రామాల్లో శ్మశానవాటిక, రేషన్ బియ్యం, ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఏర్పాటుకు నిధులు కేటాయించామని తెలిపారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలు ప్రజలకు అందడం లేదన్నారు. డబుల్ బెడ్రూం, దళిత బంధు రావడం లేదని మండిపడ్డారు. ప్రజలను ముఖ్యమంత్రి మోసం చేస్తున్నారని చెప్పారు. రైతులకు రుణమాఫీ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలపడానికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పోరెడ్డి నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ యాదగిరిరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నిధులన్నీ కేంద్రానివే:మాజీ మంత్రి దేవయ్య

యాచారం: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు వచ్చే నిధులన్నీ కేంద్ర ప్రభుత్వమే అందిస్తుందని.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నయా పైసా ఇవ్వలేదని మాజీ మంత్రి సుద్దాల దేవయ్య అన్నారు. మంగళవారం రాత్రి మండల పరిధిలోని మొండి గౌరెల్లిలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజలకు మాయమాటలు చెప్పి మరో మారు అధికారంలోకి వచ్చేందుకు యత్నిస్తున్నాడని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తప్పా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజలు బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను నమ్మడం లేదని కేంద్రం, రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరి రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు రమేశ్, శ్రీనివాస్ యాదవ్, చింతుల్ల, నందివనపర్తి మాజీ సర్పంచ్‌లు జగదీశ్, విజయ్‌కుమార్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, పాండు యాదవ్, శైలజారెడ్డి, వెంకటేశ్, శివ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌కు వీడ్కోలు పలకండి'

కేశంపేట: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు వీడ్కోలు పలకాలని బీజేపీ సీనియర్ నాయకులు వేంకటేశ్వర్‌రెడ్డి, ఏపీ మిధున్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు పసుల నర్సింహ ఆధ్వర్యంలో ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం నిరుపేదలకు ఉచితంగా రేషన్ బియ్యాన్ని అందిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కుటుంబ పాలనకు చరమగీతం పాడాలన్నారు.

మీరేం చేస్తారో చెప్పండి..?

నాయకులు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవితను విమర్శించడంతో గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి వాళ్లు ఏం చేశారో కాదు.. మీరేం చేస్తారో చెప్పండి..? అని ప్రశ్నించాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ విషయమై బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్‌ను సంప్రదించగా గ్రామానికి చెందిన శ్రీనివాస్ తన సమస్యలు చెప్పుకున్నాడన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాఘు రాంగౌడ్, పాండురంగారెడ్డి, పారేశ్ యాదవ్, ఐలయ్య, శివశంకర్ యాదవ్, కుమార్‌గుప్తా, కుమార్ యాదవ్ తదిదరులు పాల్గొన్నారు.

శివగంగ రాజరాజేశ్వరాలయం హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న పాలకమండలి సభ్యులు

మహేశ్వరం: మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయ ఆవరణలో బుధవారం అధికారులు, పాలకవర్గం సమక్షంలో హుండీ లెక్కించారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రూ.3,32,963 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ మురళీ కృష్ణ, ఆలయ చైర్మన్ సుధీర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు చంద్రయ్య, యాదమ్మ, బాల్‌రాజ్, మహేందర్, రవీందర్, వెంకటేశ్, ఆలయ పూజారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: నిరుద్యోగ యువతకు ద్విచక్ర వాహనాల రిపేరింగ్‌లో ఉచితం శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ముచ్చింతల్ సమీపంలో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో అటల్జీ వృత్తి నైపుణ్య శిక్షణ సంస్థ, హీరో మోటాకార్ప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి హీరో మోటోకార్ప్ సర్వీసు కేంద్రంలో ఉద్యోగావకాశం కల్పిస్తామన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్ల వయసు గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 64 రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు.

యువతి అదృశ్యం


సాయిదివ్య(ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మధుబన్ కాలనీకి చెందిన శ్రీనివాసరావు కుమార్తె జి.సాయిదివ్య(23) ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో సాయిదివ్య ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం చుట్టు పక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో పాన్ షాపు నిర్వాహకుడు మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్వేత తెలిపిన ప్రకారం.. టోలిచౌకీ ప్రాంతానికి చెందిన తాహేర్(38) రాజేంద్రనగర్‌లో పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం తన బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తాహేర్ తల, ఛాతీకి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నీ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

నగరం నుంచి బ్యాంకాక్‌కు నోక్ ఎయిర్ సర్వీసులు


నోక్ ఎయిర్ సర్వీసును ప్రారంభిస్తున్న సంస్థ, జీఎంఆర్ ప్రతినిధులు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బ్యాంకాక్‌కు నోక్ ఎయిర్ విమాన సర్వీసులు బుధవారం ప్రారంభమయ్యాయి. అర్థరాత్రి 12.40 గంటలకు ఇక్కడి నుంచి నోక్ ఎయిర్ విమాన సర్వీసు బ్యాంకాక్‌లోని డాన్ ముయాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బయలుదేరింది. నోక్ ఎయిర్‌లైన్స్ దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ నుంచి తన సర్వీసులను ప్రారంభించింది. వారంలో మూడు రోజుల పాటు ఇక్కడి నుంచి ముయాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి 737 మాక్స్–8 విమానం రాకపోకలు సాగిస్తుంది. ప్రస్తుతం థాయ్ ఎయిర్‌లైన్స్ సర్వీసు మాత్రమే ఇక్కడి నుంచి బ్యాంకాక్‌లోని సువర్ణభూమి ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగిస్తోంది. బ్యాంకాక్‌కు వెళ్లే పర్యాటకులు, ప్రయాణికులకు దీంతో మరో సర్వీసు అందుబాటులోకి వచ్చిందని ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ తెలిపారు. అంతర్జాతీయంగా మరిన్ని గమ్యస్థానాలకు పెంచేందుకు హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సన్నద్ధంగా ఉందన్నారు.

దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించండి

వ్యవసాయ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ రఘునందన్‌రావు


మాట్లాడుతున్న రఘునందన్‌రావు

ఏజీవర్సిటీ: వాతావరణ మార్పుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి పరిష్కారం చూపాలని వ్యవసాయ శాఖ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ జయశంకర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ రఘునందన్‌రావు అన్నారు. రాజేంద్రనగర్‌లోని నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో 3వ పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణలో పెద్ద ఎత్తున సాగునీటి వనరులు కల్పించిన నేపథ్యంలో భూముల్లో ఎటువంటి మార్పులు కనిపిస్తున్నాయో రైతులతో చర్చించి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలన్నారు. అంతే కాకుండా రైతుల ఆదాయం పెంచడానికి అవసరమైన సాంకేతికతను అభివృద్ధి పరచాలన్నారు. సుస్థిర వ్యవసాయం వైపు రైతులను మళ్లించాల్సిన అవసరం ఉందని, రసాయన ఎరువులు తగ్గించాలని, అప్పుడే రైతులకు ఖర్చు తగ్గుతుందన్నారు. 2020–22 సంవత్సరంలో నిర్వహించిన వ్యవసాయ పరిశోధనలు, నూతన వంగడాలను గురించి పరిశోధన సంచాలకులు డాక్టర్ జగదీశ్వర్, విస్తరణ సంచాలకులు సుధరాణి వివరించారు. ఎలక్ట్రానిక్ వింగ్ ఆధ్వర్యంలో రూపొందించిన 3 డీవీడీలను ఉపకులపతి ఇతర అధికారులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్, వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, అధికారులు తగు సూచనలు సలహాలు అందించారు.

నేటి నుంచే యాప్ ద్వారా హాజరు

- దీని ఆధారంగానే జీతభత్యాలు
- అందరూ డౌన్‌లోడ్ చేసుకోండి
- అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం


డీపీఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

వికారాబాద్ అర్బన్: జియో అటెండెన్స్ యాప్‌ను ప్రభుత్వ ఉద్యోగులందరూ డౌన్ లోడ్ చేసుకొని గురువారం నుంచి హాజరును నమోదు చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నీ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ అటెండెన్స్ యాప్ ను పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. దీని ఆధారంగానే సిబ్బందికి జీత భత్యాలు అందిస్తామని తెలిపారు. జిల్లాలో ఇంకా చాలా మంది సిబ్బంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోలేదని తెలిపారు. వారందరూ వెంటనే డౌన్ లోడ్ చేసుకునే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎన్నికల నోడల్ ఆఫీసర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ ఐడీ కార్డులను వెంటనే అప్‌డేట్ చేయాలని సూచించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వారీగా ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల ఓటర్ల వివరాలను వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. జిల్లాలో 17 మండలాల్లో 18 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్, తాగు నీరు, మరుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

దత్తత తీసుకున్నామనే ఆలోచన రావద్దు..

పిల్లలను దత్తత తీసుకున్నామనే ఆలోచన రావద్దని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. వికారాబాద్ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆరుగురు చిన్నారులను నలుగురు దంపతులకు కలెక్టర్ చేతుల మీదుగా దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒక సారి దత్తత తీసుకున్న వారి ఇళ్లను సందర్శించి పిల్లల బాగోగులను చూసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారిని ఆదేశించారు.

ప్రతి కార్యాలయం దేవాలయమే..

వికారాబాద్ అర్బన్: కార్యాలయాలను దేవాలయాలుగా భావించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో జిల్లా పంచాయతీ రాజ్ అధికారి కార్యాలయాన్ని డీపీఓ తరుణ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు ప్రతి రోజు ఇంట్లో కంటే ఎక్కువ సమయాన్ని కార్యాలయాల్లో గడుపుతారని, కనుక మన ఇంటిలా భావించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్ పరిసరాల్లో చేపడుతున్న పరిశుభ్రతను కలెక్టర్ పరిశీలించారు.